క్లుప్తంగా

వర్షాలు కురవాలని వన భోజనాలు

అడ్డాకుల: మండలంలోని పొన్నకల్ గ్రామంలో గ్రామస్తులు ఆదివారం వర్షాలు కురవాలని ఊరు విడిచి వనాలకు వెళ్లారు. అదేవిధంగా మూసాపేట మండలంలోని సంకలమద్ది, అచ్చాయపల్లి, నిజాలాపూర్‌లోనూ గ్రామస్తులు వనాలకు వెళ్లారు. అక్కడే భోజనాలు చేశారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్ కూకట్‌పల్లిలో నియుధ లీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 2వ నేషనల్ కరాటే టోర్నీలో జిల్లా కేంద్రానికి చెందిన శ్రీహనుమాన్ కరాటే, యోగా అసోసియేషన్ విద్యార్థులు ప్రతిభచాటినట్లు ఫౌండర్, సీనియర్ కరాటే మాస్టర్ కె.వెంకటేశ్ తెలిపారు. ఈ టోర్నీలో కటాస్ అండర్–10 విభాగంలో కె.సాయిచరణ్, అండర్–12లో రిత్విక్‌సాయి ప్రథమ స్థానంలో నిలిచి పతకాలు సాధించినట్లు వివరించారు. విద్యార్థులను అభినందించారు.

ఆర్థిక సాయం

కోయిల్‌కొండ: మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన వడ్డెపెద్దరాజు దంపతులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో అనాథలుగా మారిన వారి ముగ్గురు పిల్లలకు అండగా ఉంటామని కోయిల్‌కొండ ఉన్నతపాఠశాల 1999–2000 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ముందుకు వచ్చారు. ఆదివారం రూ. 22వేలు ఆర్థికసాయం అందజేశారు. రామస్వామి, రాఘవేందర్, దిలీప్‌శర్మ, వేణుచారి, ఆనంద్, ఆంజనేయులు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

యూట్యూబర్లుగానే పరిగణించాలి

జడ్చర్ల టౌన్: యూట్యూబ్ నిర్వహిస్తున్న వారిని జర్నలిస్టులుగా పరిగణనలోకి తీసుకోరాదని జడ్చర్ల జర్నలిస్ట్ జేఏసీ తీర్మానించింది. గంగాపురం శివారులోని నిర్వహించిన సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదించారు. డీపీఆర్ఓ ద్వారా అక్రిడేషన్ కార్డు పొందిన వారిని, మీడియా సంస్థల గుర్తింపుకార్డులు, ఆయా పత్రికలతో పొందిన గుర్తింపు కార్డులు కలిగిన వారిని మాత్రమే జర్నలిస్టుగా పరిగణించాలని నిర్ణయించారు. అదేవిధంగా డబుల్‌బెడ్‌రూం నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా స్థానిక ఎమ్మెల్యే సహకారం తీసుకోవాలని, సెకండ్‌లిస్టులో ఉన్న వారికి ప్లాట్ల కేటాయింపులు జరిగేలా చూడాలని నిర్ణయించారు. వెబ్, ఆన్‌లైన్ పేపర్లను సైతం పరిగణనలోకి తీసుకోకూడదని నిర్ణయించారు. సమావేశంలో జేఏసీ కన్వీనర్ కృష్ణ, కో కన్వీనర్లు శ్రీధర్, కరీం, శ్రీనివాస్, నరేందర్‌గౌడ్, సభ్యులు పాల్గొన్నారు.

సమ్మేళనంలో పాల్గొన్న జిల్లా కవులు

స్టేషన్ మహబూబ్‌నగర్: హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో ఆదివారం శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో జరిగిన జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో జిల్లా కవులు పాల్గొన్నారు. కవులు వల్లభాపురం జనార్దన్, కేఎల్.సత్యవతి, ఖాజా మైనద్దీన్, పులి జమున, ఎంఎస్.విజయ్‌కుమార్, బసవరాజప్ప తమ కవితాగళాన్ని వినిపించారు. అనంతరం నిర్వాహక ప్రతినిధులు వారిని సన్మానించారు.

బతుకమ్మ ఆడుతూ నిరసన



మహబూబ్‌నగర్ రూరల్: డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ పారిశుద్ధ్య కార్మికులు కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమం ఆదివారం నాల్గో రోజుకు చేరుకుంది. శిబిరంలో జేఏసీ చైర్మన్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి నాయకులు పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు సమ్మెలో భాగంగా ఆదివారం బతుకమ్మలు ఆడుతూ నిరసన వ్యక్తం చేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

గండేడ్: సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ కార్మికులు కోరుతున్నారు. ఈ మేరకు ఆదివారం గండేడ్ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు గోపాల్‌లకు వినతి పత్రం సమర్పించారు. తమను రెగ్యులర్ చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు.

మిడ్జిల్: సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం నాలుగో రోజుకు చేరుకుంది. కార్మికులు జంగయ్య, అచ్చలయ్య, సాయి, బాలస్వామి,వెంకటయ్య, యాదయ్య, మైసమ్మ, భాగ్యమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్‌గా సర్పంచ్

మహబూబ్‌నగర్ రూరల్: సమస్యల పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ పారిశుద్ధ్య కార్మికులు నాలుగు రోజుల నుంచి సమ్మె బాట పట్టారు. దీంతో గ్రామంలో అపరిశుభ్రత వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలోనే ధర్మాపూర్ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యుడు నరేందర్ ఇద్దరు కలిసి ట్రాక్టర్‌తో వీధుల్లో తిరుగుతూ ఆదివారం ఉదయం చెత్తను సేకరించారు.

దేవరకద్ర: పంచాయతీ కార్మికుల సమ్మె ఆదివారం కొనసాగింది. ఇప్పా మండల కార్యదర్శి వెంకట్‌రాములు, కార్మికులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో కుళ్లిన గుడ్లు

- నెలరోజులుగా పంపిణీ
- లబ్ధిదారుల ప్రాణాలతో చెలగాటం
- వెంకట్‌రెడ్డిపల్లిలో అస్వస్థతకు గురైన బాలుడు
- పట్టించుకోని అధికారులు



అంగన్‌వాడీల్లో అందజేస్తున్న గుడ్లు(ఫైల్)



వెంకట్‌రెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చిన కుళ్లిన గుడ్డు

గండేడ్/మహమ్మదాబాద్: గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం, గుడ్లు, పాలు అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం కొందరి నిర్లక్ష్యం, అవినీతి వల్ల నీరుగారిపోతోంది. పలు కేంద్రాల్లో పూర్తిగా నిబంధనలకు నీళ్లు వదులుతున్నారు. కుళ్లిపోయిన గుడ్లను సరఫరా చేస్తూ లబ్ధిదారుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఉమ్మడి గండేడ్ మండల పరిధిలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. పలు కేంద్రాల్లో నెలరోజులుగా కుళ్లిన గుడ్లనే సరఫరా చేస్తున్నారు. ఉమ్మడి మండల పరిధిలో గండేడ్, నంచర్ల, మహమ్మదాబాద్ సెక్టార్లు ఉన్నాయి. ఈసెక్టార్లలో 84 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 1180 మంది గర్భిణులు, బాలింతలు ఉన్నారు. వీరితో పాటు 7నెలల నుంచి 3 సంవత్సరాల చిన్నారులు. 3187 మంది, 3 నుంచి 6 సంవత్సరాల వారు 2430 మంది ఉన్నారు. ఒక టీహెచ్ఆర్ పిల్లలకు మాత్రం 16 గుడ్లతో పాటు బాలమృతం ఇస్తారు. మిగతా వారికి పాలు, గుడ్డుతో పాటు పౌష్టికాహారం అందజేస్తారు. కాగా ఉమ్మడి మండల పరిధిలోని దాదాపు అన్ని కేంద్రాల్లో పౌష్టికాహారం సక్రమంగా అందడం లేదు. గుడ్లు కూడా కుళ్లినవి సరఫరా చేస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. ఉడకబెట్టిన గుడ్లు పూర్తిగా పాడవుతున్నాయని అంటున్నారు. తెల్లసొనా, పచ్చసొనాలు వేరవడంతో పాటు దుర్వాసన వస్తున్నాయని పేర్కొంటున్నారు. ఉడకబెట్టకుండా పైన ఉన్న పెంకును తీసి చూస్తే లోపల పిల్లలాగా కనిపిస్తోందని, భరించలేని వాసన వస్తోందని ఆరోపిస్తున్నారు. గండేడ్ మండలంలో రంగారెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలోనే దాదాపు 300 గుడ్లు పాడైనట్లు సమాచారం. విషయాన్ని సంబంధిత కేంద్రం నిర్వాహకులు, సూపర్‌వైజర్ కూడా సమాచారం అందించారు. మిగతాచోట్ల కూడా కుళ్లిన గుడ్లు ఉన్నట్లు ఆయా కేంద్రాల నిర్వాహకులు తెలిపారు. దాదాపు నెలరోజుల నుంచి అన్ని కేంద్రాల్లోనూ కుళ్లిన గుడ్లనే పంపిణీ చేస్తున్నారని తెలియవస్తోంది. కొత్తగా కాంట్రాక్టు మారకే ఇలాంటి పరిస్థితి దాపురించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. విషయం సంబంధిత అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని, నిమ్మకునీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారని లబ్ధిదారులు అంటున్నారు. కాగా విషయాన్ని సంబంధిత సూపర్‌వైజర్లు రాధిక, మల్లమ్మ జిల్లా అధికారులకు లిఖితపూర్వకంగా తెలియజేసినట్లు సమాచారం. కుళ్లినగుడ్లను ఎట్టి పరిస్థితుల్లో అందించవద్దని అంగన్‌వాడీ టీచర్లకు వారు సూచించారు. దీంతో నిర్వాహకులు ఉడికించేముందు గుడ్లను నీళ్లలో వేసి చూస్తున్నారు. కాగా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు స్పందించి నాణ్యమైన గుడ్లు, పాలు, ఆహారం అందజేయాలని ఆయా గ్రామాల లబ్ధిదారులు కోరుతున్నారు. పౌష్టికాహారం పేరుతో పేదల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని అంటున్నారు.

అస్వస్థతకు గురైన బాలుడు



ఈశ్వర్

కుళ్లిన గుడ్డు తిని ఓ చిన్నారి అస్వస్థతకు గురైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వెంకట్‌రెడ్డిపల్లి గ్రామానికి చెందిన మారుతి కుమారుడు ఈశ్వర్(పదినెలలు)కు ప్రతినెలా అంగన్‌వాడీ కేంద్రం నుంచి 16 గుడ్లు ఇస్తారు. ఈనెల 5న కేంద్రానికి వెళితే 16 గుడ్లు ఇచ్చారు. కాగా తెచ్చిన మరుసటి రోజు అతడి తల్లి గుడ్డు ఉడికించి ఇచ్చింది. తిన్న కొద్ది సేపటికే ఈశ్వర్ వాంతులు చేసుకున్నాడు. దీంతో ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. ప్రస్తుతం అతడు కోలుకున్నాడు. కాగా మరుసటి రోజు కుటుంబీకులు మరోగుడ్డు తీసి ఉడకబెట్టకుండా పెంకు తీసి చూశారు. లోపల చిన్న పిల్లలాగ ఉండడంతో పాటు కుళ్లిన వాసన రావడంతో పక్కన పెట్టారు.

అధికారులు పట్టించుకోవాలి



అంగన్‌వాడీల్లో ఇచ్చిన గుడ్లను చూస్తేనే వాంతికి వస్తుంది. మూడు నెలల కిందట కూడా అలాగే ఉన్నాయి. సెంటర్ దగ్గరికి వెళ్లి అడిగితే మీరెక్కడ తెచ్చారో మాకేం అంటూ దాటవేస్తున్నారు. ఇప్పుడు అందించిన వాటిపై ముద్ర ఉంది. వీటిపై సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. మా బాబు గుడ్డు తిని అస్వస్థతకు గురయ్యాడు. సకాలంలో ఆస్పత్రికి తీసుకెళ్లడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. నాసిరకం గుడ్లు సరఫరా చేసి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఇకనైనా అధికారులు పట్టించుకోవాలి.

– మారుతి,
ఈశ్వర్ తండ్రి, వెంకట్‌రెడ్డిపల్లి

ఉన్నతాధికారులకు తెలియజేశాం

నెల రోజులుగా కుళ్లినగుడ్లు ఉన్నట్లు మాదృష్టికి వచ్చింది. అలాంటివి ఉంటే లబ్ధిదారులకు ఇవ్వొద్దని సూచనలు చేశాం. కాంట్రాక్టర్‌కు కూడా ఈవిషయాన్ని తెలియజేశాం. విషయంపై ఉన్నతాధికారులకు తెలియజేశాం. నాణ్యమైన గుడ్లు కేంద్రాలకు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– రాజేశ్వరీ,
సీడీపీఓ, మహబూబ్‌నగర్

యజ్ఞంతో కాలుష్య నివారణ



ఆర్యసమాజంలో యజ్ఞం నిర్వహిస్తున్న పెద్దలు

జడ్చర్ల టౌన్: యజ్ఞ నిర్వహించటం వల్ల పర్యావరణ కాలుష్యం నివారణ అవుతుందని ఆచార్యవేది సింధుయజ్ఞ అన్నారు. పట్టణంలోని ఆర్యసమాజంలో నూతన యజ్ఞ భవన ప్రారంభోత్సవానికి ఆయన హాజరై ప్రసంగించారు. యజ్ఞయాగాదులు నిర్వహించటంతో అందులో పాల్గొన్న దంపతులలో రోగ నిరదోధక శక్తి పెరుగుతుందన్నారు. పూర్వకాలంలో రాజులు విరివిగా యజ్ఞయాగాదులు చేసేవారని, ప్రస్తుత కాలంలోనూ ముఖ్యమంత్రులు ఆసక్తిచూపుతున్నారన్నారు. భవన ప్రారంభోత్సవం అనంతరం యజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బి.శివకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి, కౌన్సిలర్ చైతన్య, ఆర్యసమాజ పెద్దలు ప్రవంతి, నందిని, గుబ్బ నర్సింహులు, బక్కరాజేశ్వర్, గుబ్బ అశోక్, డి.కృష్ణయ్య, వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఆర్యసమాజ ప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని కాశికాపుడి సమాజ్ భవన్‌లో ఆదివారం రాత్రి లయన్స్ క్లబ్ ఆఫ్ మహబూబ్‌నగర్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. లయన్ నటరాజ్, లయన్ మృత్యుంజయ పాల్గొని మాట్లాడారు. సమాజ సేవలో లయన్స్ క్లబ్‌లు తమవంతు భాగస్వామ్యం అవుతున్నాయని అన్నారు. అనంతరం 2023–24 సంవత్సరానికిగాను లయన్స్ క్లబ్ ఆఫ్ మహబూబ్‌నగర్ నూతన అధ్యక్షుడిగా కె.శ్రీహరి, కార్యదర్శిగా పి.మహేష్‌కుమార్, కోశాధికారిగా ఎస్.ప్రమోద్‌కుమార్ ప్రమాణా స్వీకారం చేశారు. కార్యక్రమంలో రీజినల్ చైర్మన్ శ్రీనివాసులు, జోన్ చైర్‌పర్సన్ గోవర్ధన్, అశోక్‌కుమార్ యాదవ్, సనాతన బాల్‌రాజు, ఎం.రాములు, కె.ప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమేదీ?

బాలానగర్: పెద్దరేవల్లిలో ఏళ్లు గడుస్తున్నా రైతులకు సంబంధించిన విద్యుత్ సమస్యలు అలాగే ఉన్నాయని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రమణా రెడ్డి అన్నారు. గతంలో విద్యుత్ సమస్యలను రైతులతో కలిసి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నేటికి పరిష్కరించలేదన్నారు. అదే ప్రైవేట్ వ్యక్తుల పనులు మాత్రం ఆగమేఘాల మీద పూర్తిచేస్తారని విమర్శించారు. ఎలాంటి ఘటనలు జరగక ముందే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మైసమ్మ చెంత జనజాతర

నవాబుపేట: మండల పరిధిలోని మైసమ్మ ఆలయానికి పెద్ద సంఖ్య భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆషాఢమాసం కావడంతో రద్దీ మరింత పెరిగింది. ఈ మేరకు సౌకర్యాలు కల్పించినట్లు ఆలయ చైర్మన్ కృష్ణయ్య, అధికారి మదనేశ్వర్‌రెడ్డి తెలిపారు.

మొండి వైఖరి వీడాలి

కోయిల్‌కొండ: ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని గార్లపహాడ్ జేపీసీ కోకన్వీనర్ వెంకట్రామిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన రిలేదీక్షల్లో ఫ్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. వెంటనే మండల కేంద్రంగా ప్రకటించాలన్నారు. సాధన సమితి సభ్యులు పాల్గొన్నారు.

వాసవీమాతకు గోరింటాకుతో అలంకరణ



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం బ్రాహ్మణవాడీలో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం అమ్మవారికి గోరింటాకుతో అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు రాఘవేంద్రశర్మ గోరింటాకు ప్రాముఖ్యం గురించి వివరించారు. ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు రెడ్డి సేవా సమితి మహిళా విభాగం అధ్యక్షురాలు ఉదయశ్రీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బీకేరెడ్డికాలనీలోని బాలికల వసతి గృహంలో గోరింటాకు వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు శశికళ, సభ్యులు వరలక్ష్మి, వనజ, నర్మద, శోభ, వినోద, వంశీలత, శ్రీదేవి, సుచరిత తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత



భూత్పూర్: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతి ఒక్కరు ధర్మ మార్గంలో నడవాలని ప్రముఖ ధార్మిక వేత్త హజ్రత్ సయ్యద్ ఆలే ముస్తాఫా అన్నారు. శనివారం రాత్రి పట్టణంలోని జామీయ మజీద్ ఆవరణలో ఫైజాన్ కాజ్మీయ ధార్మిక సభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతివ్యక్తి తాను సంపాదించిన ఆదాయంలో కొంత నిరుపేదల సంక్షేమానికి వినియోగించాలని చెప్పారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కొత్తకోటకు చెందిన మత పెద్ద మౌలానా అబీద్ హుస్సేన్ ఖాద్రీ, జామియా నిజామియాకు చెందిన మౌలానా ఇఫ్తాకార్ అహ్మద్ ఖాద్రీ, స్థానిక జామీయ మజీద్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే రాష్ట్రాభివృద్ధి

కోయిల్‌కొండ: బీఆర్ఎస్‌తోనే రాష్ట్రం అభివృద్ధి సాధించిందని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మైనార్టీ కమ్యూనిటి హాల్, మహిళాసమాఖ్య నూతన భవనం, ఎంపీడీఓ కార్యాలయ ప్రహరీ, అదనపు గదుల నిర్మాణం తదితర పనులకు శంకుస్థాపన చేశారు. చేశారు. అంకిళ్ల బొడ్రాయి ప్రతిష్ఠ ఉత్సవాలలో పాల్గొన్నారు. ఎంపీపీ శశికళ, సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ జయరాములు, నాయకులు శమీం, రాజవర్ధన్‌రెడ్డి, ఆశన్నగౌడ్, రాజ్‌కుమార్, కుమ్మరిరాజు, శ్యాంసుందర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత మెంటార్‌షిప్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: వచ్చే ఏడాది జరిగే నీట్‌కు సిద్ధమయ్యే విద్యార్థులకు ఉచిత మెంటార్‌షిప్, టెస్ట్ సిరీస్ అందిస్తామని మెటామైండ్ అకాడమీ డైరెక్టర్ మనోజ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్‌లో కోచింగ్ సైతం ఇవ్వనున్నామన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నం .8522958575, 7032264910 లను సంప్రదించవచ్చన్నారు.

ముగిసిన నాటకోత్సవాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ టౌన్‌హాల్‌లో పాలమూరు ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పద్యనాటకోత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు పలు పౌరాణిక నాటకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాలమూరు ఆర్ట్స్ థియేటర్స్ ప్రధాన కార్యదర్శి టి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భాగవత సప్తాహం

జడ్చర్ల టౌన్: పట్టణంలో ఏడు రోజులుగా నిర్వహిస్తున్న భాగవత సప్తాహం ఆదివారంతో ముగిసింది. సనాతన జాగరణ సమితి, దత్తాత్రేయ జాగరణ భక్తబృందం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కవి, ప్రవచన కర్త బుచ్చిలింగం మాట్లాడారు. విద్యార్థులకు దేశభక్తి పద్యాలు, శ్లోకాల ప్రతిభ పోటీలు, మహిళలకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రాణేష్, ముటుపూర్ జగదీశ్వర్, అమర్నాథ్, అంబిరామచంద్రన్ పాల్గొన్నారు.

రుమాండ్ల పద్మకే ట్రస్ట్ బాధ్యతలు

మహబూబ్‌నగర్ రూరల్: పద్మశాలి సేవా సంఘం ట్రస్ట్ నిర్వహణ బాధ్యతలు మాజీ ఎంపీ దివంగత రుమాండ్ల రామచంద్రయ్య సతీమణి పద్మకు దక్కాయి. ఈ ట్రస్ట్ విషయమై గతంలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపిన కోర్టు నిర్వహణ బాధ్యతలను మళ్లీ పద్మకు అప్పగిస్తూ తీర్పు చెప్పింది. ఆదివారం ట్రస్ట్ భవనంలో సమావేశమైన సేవా సంఘం సభ్యులు ఎట్టకేలకు ట్రస్ట్ ఏర్పాటు చేసిన రుమాండ్ల రామచంద్రయ్య సంబంధీకులకే దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ పద్మ మాట్లాడుతూ రుమాండ్ల రామచంద్రయ్య ఎంపీ నిధులతో నిర్మించిన ఈ ట్రస్ట్ భవనాన్ని స్వార్థపరుల చేతుల్లోంచి తిరిగి స్వాధీనపరుచుకుని రామచంద్రయ్య పద్మశాలీల పట్ల చూపిన సేవాభావాన్ని కొనసాగిస్తామన్నారు. న్యాయస్థానంలో బలమైన వాదనలను చేసి ట్రస్ట్ స్వాధీనంలో కీలక భూమిక పోషించిన న్యాయవాది కొంగర అనిల్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడిగా గోపాల్‌తోపాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమావేశంలో ట్రస్ట్ సభ్యులు వినయ్‌కుమార్, శ్రీరాం, లక్ష్మీనారాయణ, రఘు, లక్ష్మీకాంత్, రాములు, సూర్యప్రతాప్ పాల్గొన్నారు.

ఖాళీ స్థలంలో నిర్మాణం చేపడతాం



విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని ఈద్గా వక్ఫ్ రహెమానియా పక్కన ఉన్న ఖాళీ వక్ఫ్ స్థలంలో ముస్లిం కమ్యూనిటీహాల్ షాదీఖానా నిర్మాణాలు చేపడుతామని పలువురు ముస్లిం ప్రజాప్రతినిధులు, నాయకులు అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చేతులమీదుగా రూ.కోటి నిధులతో వీటి నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఈద్గా వద్ద నిర్మాణం చేపడుతారని కొందరు వాస్తవాలకు దూరంగా మాట్లాడుతున్నారని, కానీ ఈద్గా సమీపంలో ఖాళీగా ఉన్న వక్ఫ్ స్థలంలో నిర్మాణం చేపడుతామని తెలిపారు. నిర్మాణం తర్వాత భవనం ఈద్గా కమిటీకి చెందుతుందన్నారు. భవనాన్ని ఈద్ ప్రార్థనల కోసం వినియోగిస్తామన్నారు. అదేవిధంగా హాల్‌ను అనాథల వివాహాలకు ఉచితంగా ఇస్తామన్నారు. మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వక్ఫ్ ప్రొటెక్షన్ కోఆర్డినేటర్ కమిటీ సభ్యులు ఖాజా ఫయాజుద్దీన్ అన్వర్‌పాష, మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్‌రహెమాన్, ఈద్గా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తఖీ హుస్సేన్, హాఫిజ్ ఇద్రీస్, జామియ మజీద్ మేనేజింగ్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అహ్మద్‌సనా, అబ్దుల్ జకీ, నాయకులు తదితరులు ఉన్నారు.

క్రీడాకారులు తైక్వాండోలో రాణించాలి



విద్యార్థులతో మున్సిపల్ వైస్‌చైర్మన్ తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా క్రీడాకారులు తైక్వాండోలో రాణించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ తాటి గణేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్ కల్యాణ మండపంలో ఆదివారం జిల్లా తైక్వాండో సంఘం ఆధ్వర్యంలో క్రీడాకారులకు ఒక్క రోజు ప్రత్యేక పుమ్‌సే శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వైస్ చైర్మన్ నిరంతరం సాధన చేయడం ద్వారా దేహదారుఢ్యంతోపాటు మానసికంగా ఎదగవచ్చని అన్నారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సురేందర్‌బాబు మాట్లాడూతు తైక్వాండో నిబంధనలను మాస్టర్లు, విద్యార్థులకు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ 55 మంది సీనియర్ క్రీడాకారులు, విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు. అనంతరం బ్లాక్‌బెల్టు అవార్డింగ్ నిర్వహించి 13 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జి.సాయిలు, కోశాధికారి ప్రవీణ్‌కుమార్, రాజు, భీమయ్య, శంకర్, లయ, వీణ, కార్తీక్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతలేని 'డబుల్'ఇళ్లు

నవాబుపేట: నాణ్యత లోపంగా నిర్మాణం చేపట్టిన డబుల్ ఇళ్లు లబ్ధిదారులకు అందకుండానే శిథిలమైపోతున్నాయని మాజీ ఎమ్మెల్యే, పీసీసీ ఉపాధ్యాక్షుడు ఎర్రశేఖర్ అన్నారు. ఆదివారం యన్మన్‌గండ్లలో నిర్మించిన డబుల్ ఇళ్లను పరిశీలించారు. నిర్మించి ఏళ్లు గడుస్తున్నా లబ్ధిదారులకు ఇవ్వలేదని విమర్శించారు. పీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, మండల నాయకులు పాల్గొన్నారు.

మైనార్టీలను విస్మరించడం తగదు

భూత్పూర్: ఇటీవల దేవరకద్ర నియోజకవర్గంలో వివిధ మండలాలకు చెందిన పార్టీ అధ్యక్షుల నియామకాల్లో మైనార్టీలను విస్మరించడం తగదని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ సాధిక్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నియోజక వర్గంలో ఒక్కదాంట్లో కూడా పదవి కేటాయించకపోవడం బాధకరమన్నారు. పైరవీలు చేస్తున్నవారికి పదవులు ఇవ్వడం తగదన్నారు.

పాదయాత్ర విజయవంతం కావాలని పూజ

జడ్చర్ల: గంగాపూర్ లక్ష్మీచెన్నకేవశవస్వామి ఆలయంలో నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. నవాబ్‌పేట నుంచి ప్రారంభించిన ప్రజాహిత పాదయాత్ర విజయవంతం కావాలని స్వామివారిని వేడుకున్నారు. జడ్చర్ల హౌసింగ్‌బోర్డు కాలనీలో రామాలయంలోనూ పూజలు చేశారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జెడ్పీటీసీ మాజీ సభ్యులు ఎండీ రబ్బానీ, మాజీ ఎంపీపీ నిత్యానందం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు

మహబూబ్‌నగర్ రూరల్: అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎంపీపీ సుధాశ్రీ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అప్పాయిపల్లిలో సర్పంచ్ ఊశన్న ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు అల్లావోద్దీన్, నాయకులు రాఘవేందర్‌గౌడ్, ఆంజనేయులు, సత్తయ్య, భగవంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా బోనాలు



పాతపాలమూర్‌లో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

మహబూబ్‌నగర్ రూరల్: పట్టణంలోని 11వ వార్డు పాతపాలమూరులో శ్రీ మైసమ్మదేవి బోనాల వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శివసత్తుల పూనకాలు, మహిళల బొడ్డెమ్మల మధ్య బోనాల ఊరేగింపు ముందుకు కలిదింది. కార్యక్రమంలో నిర్వాహకులు కె.నాగయ్య, కె.నర్సిములు, ఎ.నారాయణ, ఎ.బాలకిష్టయ్య, ఎంకన్న, పి.యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం కుర్వినిశెట్టికాలనీలో తోట మైసమ్మ దేవి ఆలయంలో ఆషాఢ మాసోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 లీటర్ల పాలతో అమ్మవారికి విశేష అభిషేకం చేశారు. అదేవిధంగా మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం బోనాల వేడుక వైభవంగా నిర్వహించారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ నర్సిములు, వైస్ చైర్మన్ గణేష్, ముడా చైర్మన్ గంజి వెంకన్న, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: మండల పరిధిలోని తీగలపల్లి, చాకలపల్లి గ్రామాల్లో మైసమ్మ, పోచమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు. సర్పంచ్‌లు జంగయ్య, రాములమ్మ, చెన్నయ్య, శేఖర్, బాలకిష్టయ్య, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హన్వాడ: చిన్నదర్పల్లిలో బోనాల వేడుక ఘనంగా నిర్వహించారు. కౌన్సిలర్ లక్ష్మణ్, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

రాజాపూర్: మండల పరిధిలోని ముదిరెడ్డిపల్లి వద్ద జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని దంపతులకు గాయాలైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మేడ్చల్‌జిల్లా, మండలం బహదూర్‌పల్లి గ్రామానికి చెందిన శివమ్మ, భర్త శంకర్‌నాయక్‌లు తమ మోటర్‌సైకిల్‌పై జడ్చర్లలోని బంధువుల ఇంటికి హైదరాబాద్ నుంచి వస్తుండగా ముదిరెడ్డిపల్లి బస్టాప్‌వద్ద జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఘటనలో వారు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలిసిన స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్య కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు తరలించారు. శంకర్‌నాయక్ బావమర్ది ఫిర్యాదు మేరకు కేసున మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాజాపూర్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

నియామకం

స్టేషన్ మహబూబ్‌నగర్/మిడ్జిల్: కాంగ్రెస్ పార్టీ జిల్లా లీగల్‌సెల్‌లో ఇద్దరిని నియమించారు. జిల్లా అధ్యక్షుడిగా డబ్బుల నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షుడిగా రాజేష్ నియమితులయ్యారు. అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. లీగల్‌సెల్ జిల్లా చైర్మన్ బి.కురుమయ్య, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సిరాజ్ ఖాద్రీ, లక్ష్మణ్ యాదవ్, రాములు యాదవ్, తాహెర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.